క్లుప్తంగా

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్‌: విద్యుత్‌ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్‌ 33/11కేవీ సబ్‌స్టేషన్‌ ఎన్‌ఎఫ్‌సీనగర్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు బుగ్గానగర్‌, అంబేడ్కర్‌నగర్‌, పద్మారెడ్డి ముఖద్వారం ఏరియా పరిధిలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ఘట్‌కేసర్‌ ఏఈ యశ్వంతకుమార్‌రెడ్డి తెలిపారు.

కీసర: రాంపల్లి దాయర విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో 11 కేవి వన్నిగూడ అగ్రికల్చర్‌ విద్యుత్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బర్సిగూడ, వన్నిగూడ, తిరుమలకాలేజీ, బర్సిగూడ అగ్రికల్చర్‌, వన్నిగూడ అగ్రికల్చర్‌ వివేకానంద కాలేజీ, భోగారం అగ్రికల్చర్‌ ఏరియాలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌ వినియోగదారులు, గమనించాలని కీసర విద్యుత్‌ ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

పోచారం: విద్యుత్‌ లైన్ల విస్తరణ కారణంగా గురువారం విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ ప్రదీప్‌కుమార్‌ తెలిపారు. మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు అన్నానగర్‌, డాక్టర్స్‌ కాలనీ, జోడిమెట్ల చౌరస్తా, హుడా, కాకతీయ, స్వర్ణగిరి, వైభవ్‌ కాలనీలు, చౌదరిగూడ, నారపల్లిలోని సప్తగిరికాలనీ, రేవతి రైస్‌మిల్‌, వీకర్‌ సెక్షన్‌కాలనీ, అంజనీ స్కూల్‌ ప్రాంతాల్లో కరెంట్‌ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్‌



చెక్కు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌

ఘట్‌కేసర్‌: సీఎంఆర్‌ఎఫ్‌ నిరుపేదలకు అండగా నిలుస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్‌ నాయకులు వజ్రేష్‌యాదవ్‌ అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన మున్సిపాలిటీకి చెందిన నరసింహారెడ్డికి సీఎంఆర్‌ఎఫ్‌ నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును గురువారం అందజేశారు. మున్సిపల్‌ కాంగ్రెస్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్‌, రాధాకృష్ణముదిరాజ్‌, కౌన్సిలర్‌ మల్లేష్‌, జంగయ్యయాదవ్‌, సంజీవరెడ్డి, సిరాజ్‌, సునీల్‌కుమార్‌, బల్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కేలండర్‌ ఆవిష్కరణ



ఆవిష్కరణలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి

కీసర: గత 50 ఏళ్లుగా ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పీఆర్‌టీయూటీఎస్‌ సంఘం పనిచేస్తుందని, సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి సన్నిధిలో 2025 కేలండర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి పులగం దామోదరరెడ్డి, పీఆర్‌టీయూటీఎస్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్‌రెడ్డి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కమలాకర్‌రావు, లక్ష్మణ్‌, మేడ్చల్‌ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌గౌడ్‌, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి జిల్లాల అధ్యక్షులు శశిధర్‌ శర్మ, మానయ్య, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్‌, కాంగ్రెస్‌ నేతలు

మేడ్చల్‌: మేడ్చల్‌ పెద్ద చెరువు వద్ద చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని 6వ వార్డు కౌన్సిలర్‌ మణికంఠగౌడ్‌ అన్నారు. అధికారులతో కలిసి చెరువు వద్ద చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. చెరువు మత్తడి వద్ద రూ.2 లక్షలతో నిర్మిస్తున్న నీటిట్యాంక్‌, స్నానపు గదుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. చెరువుకు వచ్చే వారి కోసం నిర్మిస్తున్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్‌ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, శంకర్‌, సంతోష్‌, లాయక్‌అలీ మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంక్‌ సేవలకు అంతరాయం

మేడ్చల్‌రూరల్‌ : ఎల్లంపేట్‌ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు ఈనెల 28 నుంచి 31 వరకు అంతరాయం ఉంటుందని నగర రిజనల్‌ మేనేజర్‌ వెంకట్‌రామ్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్‌ సాయికుమార్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంక్‌ 2025 జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్‌ బ్యాంకులో విలీనం కావడంతో ఈ అంతరాయం ఉంటుందన్నారు.



బయటికి వెళ్లేందుకు దారిలేక..



ప్రమాదకరంగా కట్టెల పై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ, చిన్నారి

పనులిట్ల.. పోవుడెట్ల ?

• నత్త నడకన స్ట్రామ్‌ వాటర్‌ డ్రెయిన్‌ పనులు • తీవ్ర ఇబ్బందిపడుతున్న స్థానికులు • పెండింగ్‌ పనులు పూర్తి చేయాలని ప్రజల డిమాండ్‌



ప్రమాదకరంగా వరద నీటి కాల్వ

రామంతాపూర్‌ : డివిజన్‌ పరిధి వివేక్‌నగర్‌లో రూ. కోటితో గత 4 నెలల క్రితం ప్రారంభించిన వరద నీటి కాల్వ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు ప్రారంభించిన అనంతరం మధ్యలోనే చాలా రోజులు నిర్మాణాలు నిలిపేయడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన చెందుతున్నారు.

ఇళ్ల నుంచి బయటికి రావడానికి ఇబ్బంది..

డ్రెయిన్‌ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఓ వైపున ఉన్న ఇళ్ల నుంచి బయటకు రావడానికి దారి లేకపోవడంతో నాలాపై కట్టెలతో ఏర్పాటు చేసిన వంతెనపై భయం భయంగా నడుస్తూ ఎప్పుడు పడిపోతామోనని ఆందోళన చెందుతున్నారు.

కార్పొరేటర్‌ ఆగ్రహం..

నాలా నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా అధికారులపై స్థానిక కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని, లేదంటే అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్‌ హెచ్చరించారు.

కలుషిత తాగునీటి సరఫరా..

మల్లాపూర్‌: డివిజన్‌ పరిధిలోని నెహ్రూనగర్‌ రెండో బ్లాక్‌లో గతవారం రోజులుగా డ్రైనేజీ నీరు తాగునీటి సరఫరా అవుతోందని, నెహ్రూనగర్‌ వాసి రామాంజనేయులు తెలిపారు. దీనిపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. కలుషిత నీరు తాగి చాలా మంది అనారోగ్యాల పాలవుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా తాగునీటి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలన్నారు.



నెహ్రూనగర్‌లో పారుతున్న డ్రైనేజీ నీరు

జాతీయ హ్యాండ్‌ బాల్‌ జట్టుకు ఎంపిక

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీ అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహేంద్రహిల్స్‌ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు జాతీయ హ్యాండ్‌బాల్‌ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు అనుష, కల్పనను ప్రిన్సిపాల్‌ స్నేహలత గురువారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి తమిళనాడు దిండిగల్‌ జీఎస్‌టీయూ ఆర్ట్స్‌ కళాశాలలో జరగనున్న 46వ జూనియర్స్‌ బాలికల జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్‌ చాంపియన్‌షిప్‌–2024 పోటీల్లో వారు పాల్గొననున్నారు. శిక్షకురాలు పద్మినిగుప్తా, భిక్షపతియాదవ్‌, క్రీడాకారులు పాల్గొన్నారు.



శ్రీవారికి చందనసేవ

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో మూలవిరాట్‌కు ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా చందనసేవ నిర్వహించారు. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు మాట్లాడుతూ.. గురువారం ఏకాదశి తిథి ఉండటంతో ఈ సేవ నిర్వహించామన్నారు. ఈవో రవీందర్‌రెడ్డి, అర్చకులు తులసీరమణాచార్యులు, క్లర్క్‌ సుధాకర్‌, భక్తులు పాల్గొన్నారు.



చందన అలంకారంలో స్వామివారు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

పారిశుద్ధ్య కార్మికులకు దప్పట్ల పంపిణీ

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని హనుమాన్‌పేటలో సీనియర్‌ సిటిజన్స్‌ అసోసియేషన్‌ ఏవీ.స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వెంకటేష్‌యాదవ్‌, పీవీ.శ్రీనివాస్‌, రాజు, రాంచందర్‌, పీవీ.సత్యనారాయణ, నాగరాజు, జీఎన్‌వీ.సతీష్‌, పరమేష్‌, బాలరాజుయాదవ్‌, శంకర్‌, ప్రవీణ్‌, చక్రవర్తి పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యకు కారకుడి రిమాండ్‌

జవహర్‌నగర్‌: యాసిడ్‌ తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువతి మృతికి కారణమైన యువకుడికి రిమాండ్‌ విధించారు. సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ న్యూ భవానీనగర్‌లో నివసించే పూర్ణిమ (19), అదే కాలనీకి చెందిన శివరాత్రి నిఖిల్‌ (21) అనే యువకుడు ప్రేమిస్తున్నానని, నాలుగేళ్లుగా వెంటపడుతూ వేధింపులకు పాల్పడ్డాడు. ఇది తట్టుకోలేక ఆమె బుధవారం యాసిడ్‌ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు 24 గంటల్లోనే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అల్వాల్‌: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌ రామ్‌నగర్‌లో నివసించే నర్సింహులు (42) కూలీ పనిచేసుకుంటూ. జీవనం సాగిస్తుండేవాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. కాగా గురువారం ఉదయం అల్వాల్‌లోని మద్యం షాప్‌ వద్ద మద్యం సేవించిన అనంతరం రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పరిశీలించగా అప్పటికే అతడు మృతిచెందాడు. మద్యం తాగిన అనంతరం ఫిట్స్‌ వచ్చి ఉండొచ్చని, పోలీసులు భావిస్తున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

అల్వాల్‌: వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌ కాలనీలో నివసించే శైలేందర్‌(46), ఈనెల 22న టిఫిన్‌ చేసి వస్తానని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శైలేందర్‌ (ఫైల్‌)



వార్షికోత్సవ వేడుకల్లో మేయర్‌ అజయ్‌యాదవ్‌

కృషి, పట్టుదలతో ఉజ్వల భవిష్యత్‌

బోడుప్పల్‌: కృషి, పట్టుదలతో పాటు ప్రణాళికాబద్ధంగా చదువుకుని విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ అన్నారు. బోడుప్పల్‌ ఆర్‌ కన్వెన్షన్‌లో జరిగిన జేజీఆర్‌ ఉన్నత పాఠశాల 23వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని అందుకు అనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని, నైతిక విలువలు, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్నారు. డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌, కార్పొరేటర్‌ రాసాల వెంకటేష్‌యాదవ్‌, పాఠశాల కరస్పాండెంట్‌ గంగరాజు, ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనువిందు కాదిదీ.. ప్రాణ సంకటం



బొక్కొనిగూడ నుంచి ఘనాపూర్‌కు వెళ్లే దారిలో పచ్చదనంతో కనువిందు చేస్తోంది. కానీ ఈ పచ్చదనమే జలచరాలకు ప్రాణ సంకటంగా మారుతోంది. ఎరిమల్లె వాగులో గుర్రపు డెక్క ఏపుగా పెరగడంతో చూడడానికి గార్డెన్‌ను తలపిస్తోంది. – ఘట్‌కేసర్‌

స్వామియే శరణం అయ్యప్ప



రావల్‌కోల్‌లో అయ్యప్ప ఊరేగింపు



ప్రత్యేక పూజల్లో కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌

మేడ్చల్‌రూరల్‌: మున్సిపాలిటీ పరిధి పూడూర్‌ గ్రామంలోని హరిహర నందన అయ్యప్ప దేవాలయంలో ఆలయ ధర్మకర్త మల్లారెడ్డి, గురుస్వామి మాధవచారి ఆధ్వర్యంలో మండల పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు వెంకటేష్‌శర్మ, వేదప్రకాష్‌, అనిల్‌శర్మ గణపతిహోమం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేసి, సాయంత్రం మహాపడి వెలిగించారు. మండల పూజల్లో కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌ పాల్గొన్నారు. ఆలయన ధర్మకర్త మల్లారెడ్డి ఎమ్మెల్యేను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

పోచారం: అన్నోజిగూడలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన పంబా రట్టు కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఏటా అన్నోజిగూడలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఆలయ ధర్మ కర్త బాలగోని వెంకటేశ్‌గౌడ్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మేడ్చల్‌: మేడ్చల్‌ అయ్యప్ప దేవాలయంలో గురువారం మండల పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ గురుస్వామి నందారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. విద్యుత్‌ దీపాలతో అందంగా అలంకరించి, స్వాములు నృత్యాలు, భజనలు చేస్తూ ఊరేగింపు అట్టహాసంగా జరిగింది.

రావల్‌కోల్‌లో..

మండలంలోని రావల్‌కోల్‌ గ్రామంలో మండల పూజ సందర్భంగా అయ్యప్పకు ఘనంగా పూజలు నిర్వహించి స్వామివారిని పల్లకిపై ఊరేగించారు. గురుస్వాములు రాజేశ్వరగుప్తా, క్రిష్ణమూర్తిస్వామి, అనిల్‌, నర్సింహ్మస్వామి, రాహుల్‌యాదవ్‌, రాజు, దేవేందర్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవం

పోచారం: పోచారంలోని 'సంస్కృతి టౌన్‌షిప్‌ ఫ్లాట్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌'కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచిన బెజ్జంకి హరిప్రసాదరావుకు ఎన్నికల కమిటీ ధ్రువీకరణపత్రం అందజేసింది. ఎన్నికల కమిటీ సభ్యుడు సీహెచ్‌. సాయికుమార్‌ ఆధ్వర్యంలో అధ్యక్షుడు హరిప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు ప్రగతి, ప్రతిభ, సరిత ప్రమాణస్వీకారం చేశారు.

వ్యతిరేకించిన ప్రత్యర్థి వర్గం..

ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రత్యర్థి వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఆఫీస్‌లో జరగాల్సిన ప్రమాణస్వీకారోత్సవం బయట జరిగింది. కమిటీలో మొత్తం 12 మంది సభ్యులు ఉంటే కేవలం నలుగురితోనే ప్రమాణస్వీకారం చేయడాన్ని వ్యతిరేకించారు. అధ్యక్ష అభ్యర్థులకు వచ్చిన ఓట్లను రీకౌంటింగ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. హరిప్రసాదరావును అధ్యక్ష పదవీబాధ్యతలు నిర్వహించనీయమని, ప్రత్యర్థి భరత్‌ స్పష్టం చేశారు.



సంస్కృతి టౌన్‌షిప్‌ ఫ్లాట్‌ ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన హరిప్రసాదరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్‌ పరిధిలోని 14వ వార్డులోని శ్రీరామ్‌నగర్‌ కాలనీలో సుమారు రూ.7.5లక్షల మున్సిపల్‌ నిధులతో చేపట్టనున్న అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌ యాదవ్‌, కౌన్సిలర్‌ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి

ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో గురువారం కీసర మండల సీపీఐ సహ కార్యదర్శి వద్యు రవినాయక్‌ ఆధ్వర్యంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్‌ మాట్లాడుతూ.. 1925 డిసెంబర్‌ 26న సీపీఐ ఏర్పాటును అధికారికంగా ప్రకటించినప్పటి నుంచి దేశంలో శాస్త్రీయ సోషలిజం సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయపడ్డారు. సీపీఐ నేతలు స్వరూపనాయక్‌, వెంకటేష్‌, సత్యం, కురుమయ్య, కుమార్‌, సూరశ్రీను, నరసింహ, మల్లిక తదితరులున్నారు.

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్‌ గృహకల్ప, కాచవానిసింగారం తదితర ప్రాంతాల్లో సీపీఐ నేతలు జెండా ఆవిష్కరణ చేశారు. సీపీఐ మండల నాయకులు ఈశ్వర్‌, జయచంద్ర, సయ్యద్‌ ఖదీర్‌, సదాశివ, అన్వర్‌ పాషా, కిష్టయ్య, యేబు, సరిత, ప్రమీల, రాంచందర్‌, రాములు పాల్గొన్నారు.

పేదల కోసం సీపీఐ పోరాటం..

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లోని సీపీఐ కార్యాలయంలో పార్టీ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో గురువారం సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బీకేఎంయూ జిల్లా కార్యదర్శి తోటపల్లి శంకర్‌ హాజరై పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి, అమరులకు నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌ మాట్లాడుతూ.. పేదల కోసం నాటి నుంచి నేటి వరకు పోరాడుతున్న పార్టీ సీపీఐ అని, పేదల కష్టాలు తీరే వరకు ఎర్ర జెండాలు తెలంగాణలో ఎగురుతూనే ఉంటాయన్నారు. మేడ్చల్‌ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి నర్సింహులు, గిరిజన సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరూపనాయక్‌, ఏటీయూసీ కాప్రా మండల అధ్యక్షులు ఎల్లయ్య, సీపీఐ కీసర మండల కార్యదర్శి రవినాయక్‌, నేతలు కుమార్‌, వెంకటయ్య, సత్యం, కురుమయ్య, నర్సింహ, శ్రీను, ఎల్లయ్య, సూర్యం, మల్లిక పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



ఆర్‌జీకే కాలనీలో..



సీపీఐ జెండా ఆవిష్కరించిన పార్టీ నాయకులు